అనగనగా ఒక కథ

బ్నిం

తన సంతోషమే స్వర్గము..

నేను చచ్చిపోయాను.

పది రోజులుగా మా ఆవిడ..పిల్లల్ని బుజ్జగించి శ్రద్ధగా శ్రాద్ధం పెట్టేందుకు వాళ్లని ప్రేరేపిస్తోంది.

తను కన్నీళ్లు తుడుచుకుంటూ- అప్పోసప్పో చేసి...నా ఆత్మశాంతి కోసం ఆవిడ చేయిస్తోన్న శాంతులు నాకు కన్నీళ్లు రప్పిస్తున్నాయి.

దెయ్యాలు ఏడుస్తాయా? ఆత్మలు క్షోభిస్తాయా? అని మీరనుకోవచ్చు.

నేను చావాలని చావలేదు.

నన్నెవరూ చంపలేదు.

దురదృష్టం మా కుటుంబాన్నీ నన్నూ విడదీసింది.

డాక్టర్లు క్యాన్సర్ అన్నారు. ఒక్కరోజులో చచ్చిపోయే హార్ట్ అటాక్ వచ్చినా..నేనివాళ బెంగపడక్కర్లేదు.

నాలుగు నెల్లు..పగలనకా రేయనకా ముదురుతున్న నా రోగానికి వైద్యం చేయిస్తూ..బతుకుతానన్న ఆశలు కల్పిస్తూ..తను పొందే మానసిక క్షోభని కప్పెట్టుకుంటూ..నాకు ధైర్యం చెబుతున్న ఆ బంగార్తల్లికి పసుపూ కుంకుమా తుడిచేసి కళ్లల్లో మిగిలిన నీళ్లని కార్పించేసి..నేను పారిపోయి వచ్చేశాను.

సరళ నన్ను ఇష్టపడి పెళ్లి చేసుకుంది.

నాకు పిరికితనం కూడా ఎక్కువే-

మా ఇంట్లోవాళ్లకి నేను పెళ్ళి చేసుకున్నానని చెప్పడానికి చాలా కాలం పట్టింది.

ఐతే-సరళ కుటుంబం అంతా ఈ చెప్పీ చెప్పని పెళ్లంటే మొదట్లో ఇష్టపడలేదు గానీ-నా మంచితనాన్ని ప్రేమించి- ఇది దొంగపెళ్లనీ- ఇంట్లో చెప్పకుండా చేసుకున్నానని బెంగ పడలేదు.

అన్యోన్యంగా మేం ఇద్దరం కళ్లముందు ఉంటే మురిసిపోయారు.

విధి జీవితాల్ని తారుమారు చేసింది. పదేళ్లు తిరక్కుండా కూడబెట్టిన అంత సంపదనీ తుడిచి పెట్టుకుపోయే మాయదారి రోగం..రాకూడని చోట వచ్చింది.

వక్కపొడి కూడా వేసుకోని నాకు ఈ రోగం ఎందుకొచ్చిందో!

రాత్రీనూ సరళ 'పోనీ..ఆయన పోయి సుఖపడతాడని' గుండె దిటవు చేసుకుంటోందని అర్థమవుతోంది!

'సరళా ఎందుకేడుస్తున్నావ్! బాధల్నుంచి నువ్వూ నేనూ విముక్తులమయ్యాం! నా బాధ నువ్వు భరించలేవు! నీ బాధ నేను సహించలేను. పదేళ్లల్లో..నూరేళ్ల ఆనందాన్ని నీతో దేవుడు నాకిచ్చాడు. కానీ..నేన్నీకు అన్యాయం చేసాను. ఆస్తిపాస్తులు అప్పగించలేదు' అంటూ నా ఆత్మ క్షోభిస్తోంది.

''నిజం చెప్పు సరళా! డాక్టర్లేమన్నారు'' అని ఎన్నోసార్లు అడిగాను.

''కిమో థెరపీ చేస్తే ప్రాబ్లం సాల్వ్ ఐపోతుందన్నారు!'' అని చెప్పేది.

''అయితే-క్యాన్సరని డిక్లేర్ చేసారా?''

తను షాక్ ఐంది- దానికి ఏం జవాబు చెప్పాలో తెలియలేదని నాకు తెల్సు.

''నేను ఇంకో మూణ్నెళ్లు బతుకుతానన్నారు కదూ?'' అని అడిగేశాను ఓ రోజు.

''కాదు ఆ..రు..నె..ల..లు! ఆర్నెల్లు ప్రోబ్లం లేదన్నారు..ఈలోగా కోలుకోగలిగితే..అరవై ఏళ్లు హాయిగా బతికెయ్యొచ్చట..మీ విల్ పవర్‌ను బట్టి మన లైఫ్ ఉంటుందండీ!'' అని నా నుదుటి మీద ముద్దు పెట్టుకుంటూ చెప్పింది.

సరళ గొంతులో నిజాన్నీ-అబద్ధాన్ని ఏరుకోవడం నాకు తెల్సు.

చాలామంది అబద్ధంలో ఆనందించాలనుకుంటారు గానీ..నిజం తెల్సుకుని మరణించాలనుకోరు.

నిజం చెప్పినా- అబద్ధం చెప్పినా...నిజాన్ని అబద్ధమనుకున్నా... మభ్యపెట్టుకుంటున్నా కత్తి నా మెడమీదకి..తన మాంగల్యం మీదకి వచ్చి పడుతోందని మా ఇద్దరికీ తెలుసు.

కాలం ఎంత చిన్నదో అని ఒకళ్లకనిపిస్తే..కాలం ఎంత దీర్ఘమైందో అని ఇంకొకళ్లకనిపిస్తోంది.

పరిస్థితులు తారుమారయ్యాయి. రేపయినా నాకు విముక్తి కలిగితే బాగుండునని..సరళ మొక్కుకుంటోంది.

''ఏమి మొక్కుకున్నావ్'' అన్నాను.

''మీ కోసమే'' అంది.

''నా కోసమే ఏమని మొక్కుకున్నావ్''

''మీరు బాధలు తగ్గి హాయిగా ఉండాలని'' అంది ఏడుపు ఆపుకుంటూ.

నిజానికి ఇంకొన్ని రోజులు బతకాలని ఆశ నాకూ ఉంది.

డాక్టర్లు ఆడుకుంటున్నారు. మా రెండు జీవితాల్తోనూ ఆశలు చూపిస్తూ..

బిడ్డల్నీ నిన్నూ నిజంగా 'అనాథల్ని' చేసాననే ఫీలింగ్ నా ఆత్మను హింసపెడుతూనే ఉంది.

దేవుడు ఏ హార్ట్ అటాకో పెట్టి ఈ దీపాన్ని ఆర్పేయకుండా క్యాన్సర్ ఇచ్చి- ఇన్నాళ్లు సమయం ఇచ్చాడు.

ఈ ఆర్నెల్లలో నేను నా పెళ్లాం పిల్లలకు ఏం చేసాను? అనే బాధ నేను మీకు ఎన్నిసార్లు చెప్పినా తక్కువే. సంపాదించిన ఆస్తంతా అన్నదమ్ములు ఆక్రమించుకుంటున్నా, ఒడుపుగా పొదుపు చేసి, ఇది నా పెళ్లాం అని నిన్ను చూపించి ధైర్యంగా చెప్పకుండా, జబ్బు కూడా మీ నెత్తిన వేసి, ఖర్చుల్లో ముంచేసి, కట్టెగా మారిపోయాను.

ఈ పదిరోజుల్లో నేనెంత క్షోభించానో? నా ఆత్మశాంతికి వాళ్లు పెడుతున్న ప్రతీ పైసా వాళ్లకి నేనిస్తున్న ఎక్స్ట్రా బర్డెనే అని నాకు తెలుస్తోంది.

రోజులు గడిచినకొద్దీ వాళ్లనుభవించబోయే దరిద్రాన్ని నేను చూస్తాను. అని నాకు తెలుస్తోంది.

'ఓరి దేవుడా! మా వాళ్లని కాపాడు' అని ఎన్నిసార్లు దేవుడికి మొక్కుకుంటున్నానో?

నాలాంటి 'పాప' ఆత్ముడికి దేవుడి కరుణ దొరక్కపోయినా, దేవుడి పలుకు వినిపించింది.

'ఒరేయ్ పాపీ! నువ్వు చనిపోతావని తెలియడానికి నీకెంత టైమిచ్చానురా! దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవద్దురా!'

'ప్రాణ దీపం ఉండగానే నీ వాళ్లని ఉద్ధరించుకోవద్దురా!'

మీ మీద ఆధారపడిన వాళ్ల జీవితాన్ని అధ్వాన్నస్థితిలో పడెయ్యకండి! అని చెప్పడానికే నా గోడు.

'యజమానీ..నీ కుటుంబానికి నువ్వే దేవుడివి! మర్చిపోతే నీకు పాప విముక్తి వుంటుందా!'

ఇలాంటి మాటలేవో నా ఆత్మని నిలేస్తున్నాయి.

చందమామ కథల్లోలా దెయ్యాలొచ్చి, కుటుంబాన్ని ఉద్ధరిస్తే ఎంత బావుండేది? చేవలేని చాతకానితనం- చెయ్యగలిగినప్పుడు..చేతులు ముడుచుకుని కూర్చోవడం, చేతులు కాలాక ఆకుల కోసం వెతుక్కోవడం మనసు లేని మనుషుల దౌర్భాగ్యం.

నా ఆత్మక్షోభ మీకు ఈ కథగా చెప్పడానికి కారణం...ఒక పెద్ద నీతి ఉంది.

ఇది నిజానికి నీతి కథే-

ఆత్మలు కథలూ వ్యథలూ చెప్పడం..అభూత కల్పనలా..అనిపిస్తుంది.

మీరు నమ్మరు-

కానీ- మా ఆత్మశాంతికోసం..శాంతులూ..తర్పణాలూ దానాలూ చేస్తారెందుకని?

మా ఆత్మకి అశాంతి ఉంటుందనే కదా! మృత్యువు ఇన్నాళ్లు ఇంటి ముందు నిలబడి వెయిట్ చేసినా కనీసం నా వాళ్లకి కూడా..ఏ మంచి పనీ చేయని అశాంతికి నాలాంటి ఇంకెవ్వరూ గురి కాకూడదని నా వ్యథ మీకు..చెప్పే కథ.

★